క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కానుకలు, పిండివంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి మార్గంలో పయనింపజేసేదే భగవద్గీత



భగవద్గీత పోటీల్లో పాల్గొన్న చిన్నారి

నంద్యాల(వ్యవసాయం): భగవద్గీత పారాయణం చేయడం వల్ల భక్తి మార్గాన్ని పెంపొందించుకోవడంతో పాటు మేథస్సు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని గీతాపారాయణ సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భద్రావతి భావనారుషి దేవాలయంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జూనియర్ విభాగంలో మొదటి బహుమతి దీక్షిత, శివలీల రెండవ బహుమతి, మూడవ బహుమతి నాగలిఖిల, అక్షిత, మహేష్ యాదవ్‌లు కన్సోలేషన్ బహుమతులు పొందారు. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి షన్ముఖేశ్వరి ద్వితీయ బహుమతి, ఎస్.హర్షియ మూడవ బహుమతి, శ్రీలీలా కన్సోలేషన్ బహుమతులు శరత్ పావనీ బహుమతులు దక్కించుకున్నారు. రాధాదేవి, శ్రీకాంత్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

అయోధ్య అక్షితల పంపిణీ



భాగ్యనగరం రామాలయంలో అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం గ్రామంలో అయోధ్య అక్షితలను ఇంటింటికీ తిరిగి ఆదివారం పంపిణీ చేశారు. అలాగే ఆలయంలో ప్రతి రోజూ ఉదయం హరే రామా..హరే కృష్ణ సంకీర్తనలతో పూజలు చేయిస్తున్నారు. వీరగంధం రత్నబాబు, బ్రహ్మయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివరామకృష్ణరావు, ఆనందరావు, సీతమ్మ, పుల్లయ్య నాయుడు అక్షితలకు స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం నాయకులు ఏపీరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంఈఓ రమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం జిల్లాలోని డోన్, చాగలమర్రి, కొలిమిగుండ్ల, నంద్యాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బాలికలు 30మంది, బాలురు 40మంది పోటీల్లో పాల్గొన్నారు. సంఘం ప్రతినిధులు మహబూబ్ బాషా, రామేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, జాకీర్, వ్యాయామ ఉపాధ్యాయులు పీడీ బాబు, బాషా, హరి,షేక్షా, దస్తగిరి, జానీ పాల్గొన్నారు.

రైతు సంఘం కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ రైతు సంఘం మహాసభల్లో వీరిని ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షుడిగా డోన్‌కు చెందిన నారాయణ, ప్రధాన కార్యదర్శిగా నంద్యాలకు చెందిన సోమన్నతో పాటు ఉపాధ్యక్షులుగా బాలనరసింహులు, రంగనాయుడు, సహాయ కార్యదర్శిగా భాస్కర్, వెంకట శివుడును ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కరువు మండలాల్లో రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం ఇవ్వాలని, గ్రీన్ ల్యాండ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.



అవకాశవాదం..: ఇది రుద్రవరం నుంచి అప్పనపల్లె,గోనంపల్లె, పందిర్లపల్లె గ్రామాల మీదుగా పెద్దకంబలూరుకు వెళ్లే రోడ్డు దశాబ్దాలుగా పట్టించుకోకపోవడంతో గుంతలమయమవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు రోడ్డు వేయాలని గతంలో ప్రజాప్రతినిధులను కోరినా కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే అదిగో..ఇదిగో.. అంటూ ఓట్లు వేయించుకున్న తరువాత వదిలేశారు. ఆ తరువాత కూడా వారి ఇళ్ల చుట్టూ తిరిగి సమస్యను గుర్తు చేసినా చెవికెక్కలేదు. దీంతో వారికి ఇక్కట్లు కొనసాగాయి.



చిత్తశుద్ధి..: అదే సమస్యను 2019 ఎన్నికల సమయంలో గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల బిజేంద్రా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మేం గెలిస్తే తప్పకుండా రోడ్డు వేయిస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు గెలిచిన తరువాత ప్రభుత్వం నుంచి రూ.4కోట్లు మంజూరు చేయించి రుద్రవరం నుంచి పెద్ద కంబలూరు వరకు దాదాపు 11 కి.మీ, అక్కడి నుంచి సీఎం రోడ్డు మీదుగా మెట్ట వరకు 2.5 కి.మీ రోడ్డును విస్తరించి తారు రోడ్డు వేశారు. ఇటీవల పనులు పూర్తవడంతో ఐదు గ్రామాల ప్రజలకు అవస్థలు తీరాయి.


రస్తా మారి.. అవస్థలు తీరి

- రూ.4కోట్లతో రుద్రవరం–పెద్దకంబలూరు తారు రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఐదు గ్రామాల ప్రజలు



ఏదైనా ప్రాంత అభివృద్ధిని సూచించేది రహదారులే. గత పాలకులు కనీసం రోడ్లను కూడా బాగు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కొనసాగాయి. రోడ్డు వసతి లేకపోవడంతో ఆపద సమయంలో ఆసుపత్రులకు వెళ్లడానికి, గర్భిణులను కాన్పులకు తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యుల అవస్థలు వర్ణనాతీతం. కనీసం నడవడానికి కూడా వీలు లేనంతగా అధ్వానంగా మారడంతో రవాణా సౌకర్యం లేక ఇక్కట్లు పడ్డారు. ఏళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులకు ఆ సమస్య పట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక.. నూతనంగా రోడ్లు వేయించడంతో పలు గ్రామాల ప్రజల అవస్థలు తీరాయి.

రుద్రవరం: రుద్రవరం నుంచి అప్పనపల్లె,గోనంపల్లె,పందిర్లపల్లె గ్రామాల మీదుగా పెద్దకంబలూరుకు వెళ్లే రోడ్డు ప్రజలు రాకపోకలతో నిత్యం రద్దీ గా ఉండేది. పల్లెల నుంచి సంతలకు, వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లి రావడం ఆ దారిలో సాగేవి. ఈ దారిని దశాబ్దాల క్రితం వేశారు. కాలక్రమేణా రోడ్లు గుంతలు పడినా మరమ్మతులు చేయించకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. ఎంతలా అంటే.. అడుగో గొయ్యి.. గజానికో గుంతలా మారింది. సమస్యను ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇక ఎన్నికల సమయంలో మాత్రం ఇక కొద్దిరోజులు ఆగండి.. రోడ్డు వేయిస్తామని అరచేతిలో స్వర్గం చూపించిన నాయకులు గెలిచిన తరువాత పట్టించుకోకపోవడం షరా మామూలైంది. అయినా ఆశ చావక ఐదు గ్రామాల ప్రజలు గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కార్యక్రమంలో కూడా అధికారులకు మొరపెట్టుకున్నా నాయకుల నుంచి ఆదేశాలు రాకపోవడంతో వారు చేతులెత్తేశారు. అయితే ప్రజా ప్రభుత్వం అధికారంలో రావడంతో స్థానికులు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు సమస్య తీవ్రతను ప్రభుత్వంతో చర్చించి రూ.4కోట్లు మంజూరు చేయించారు. పనులు కొద్ది రోజుల క్రితం పూర్తవడంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పాయి. రుద్రవరం నుంచి పెద్ద కంబలూరు వరకు దాదాపు 11 కి.మీ, అక్కడి నుంచి సీఎం రోడ్డు మీదుగా మెట్ట వరకు 2.5కి.మీ రోడ్డును విస్తరించి తారు రోడ్డు వేశారు. మార్గం సుగమం కావడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.



అప్పనపల్లె-గోనంపల్లె మధ్య వేసిన సీసీ రోడ్డు

వైద్యం కోసం అలమటించేవాళ్లం



ఏదైనా అనారోగ్యానికి గురైతే గతంలో అలమటించేవాళ్లం. జబ్బు చేస్తే వైద్యం కోసం రుద్రవరం ప్రభుత్వ వైద్యశాలకు రావాలంటే వాహనాలు ఏవీ వచ్చేవి కాదు. చేసేది లేక ఎడ్ల బండిపై గుంతల మయమైన దారిలో వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం తారు వేయడం ఎంతో సంతోషంగా ఉంది.

గతంలో ఆ రోడ్డుపై నరకం అనుభవించాం



గతంలో ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించే సమయంలో గుంతలతో నరకం చూశాం. ఏదైనా అత్యవసరమై పెద్దకంబలూరు నుంచి బయటకు వెళ్లాలంటే వెనకడుగు వేశాం. తప్పనిపరిస్థితిలో వెళ్తే ఎంతో ఇబ్బంది పడ్డాం. ఇక రోడ్డు గతి ఇంతేనేమో అనుకున్నాం. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తారు రోడ్డు వేసి మా బాధలు తీర్చింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– రామసుబ్బారెడ్డి,పెద్దకంబలూరు

సీసీ రోడ్డుతో సమస్య తీరింది



రోడ్డుకు ఓ వైపు అప్పనపల్లె, చిన్నకంబలూరు పంచాయతీ, మరోవైపు గోనంపల్లె పెద్దకంబలూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలు. అయితే ఎన్నో ఏళ్లుగా ఆ రెండు గ్రామాల మధ్య రోడ్డు గుంతలు ఏర్పడి నీరు నిలిచి దుర్గంధం వెదజల్లేది. సమస్య తీర్చాలని ప్రజా ప్రతినిధులు,అధికారులను ఎన్నో మార్లు వేడుకున్నాం. పంచాయతీలు వేరు కావడంతో పట్టించుకోలేదు. ఇదంతా తమ ఖర్మ అనుకునే వాళ్లం.అలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండు గ్రామల మధ్య సీసీ రోడ్డు నిర్మించి తమ ఇబ్బందిని పరిష్కరించారు.

– లక్ష్మన్న, అప్పనపల్లె

ఇప్పుడు వైద్యం నిమిత్తం క్షణాల్లో రుద్రవరం, లేకపోతే పట్టణాలకు వెళ్లగలుగుతున్నాం. రోడ్డు వేయడం వల్ల ఒక్క వైద్యమే కాకుండా అన్ని విధాలుగా మేలు జరుగుతోంది. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పుణ్యమే. – సంజీవరాయుడు,అప్పనపల్లె



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ముగ్గుల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందీశ్వర ఆలయంలోని గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు.మొదటి బహుమతి మల్లిక, రెండవ బహుమతి శ్రీలక్ష్మి, మూడవ బహుమతి నాగరాధిక, నాల్గవ బహుమతులు పావని, సత్యప్రియ గెలుపొందారు. అధ్యక్షుడు మురళీకృష్ణారావు, కార్యదర్శి నగరడోన సుదీర్, శైలజా, రేణుక, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో..

ఆవోపా ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌యార్డులో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి మల్లిక, రెండో బహుమతి ఆదిలక్ష్మి, మూడో బహుమతి లక్ష్మికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు అందజేశారు. కన్సోలేషన్ కింద ఐదుగురికి రూ.వెయ్యి చొప్పున నగదు అందజేశారు. దీపికా, అపర్ణ, శ్రావణి, సాయికుమారి, పద్మప్రియ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఆవోపా అధ్యక్షులు గోపాలకృష్ణమూర్తి, రామకృష్ణ, కాల్వ సురేష్, మధుసూదన్ పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఎన్నికలను విశాఖపట్నంలోని లయన్స్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన లింగేశ్వరుడు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కర్నూలు జిల్లా తైక్వాండో మాస్టర్ అబ్దుల్ మజీద్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తైక్వాండో ఎన్నికలకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ నాయకుడు మాణిక్యాల్‌రావు, తైక్వాండో ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన కమిటీ కాల పరిమితి 2028 వరకు ఉంటుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా పి.అచ్యుత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ వేణుగోపాల్‌రావు, కోశాధికారిగా అర్జున్‌రావు, ఉపాధ్యాయులుగా అచ్చెన్నాయుడు, నాయబ్‌రసూల్, సంయుక్త కార్యదర్శులుగా దొరబాబు, భాస్కరరావు, జగన్‌మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారని వివరించారు.



లింగేశ్వరుడును అభినందిస్తున్న దృశ్యం

శాలివాహనులు అన్ని రంగాల్లో ముందుండాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): శాలివాహనులు అన్ని రంగాల్లో ముందుండాలని కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ బలరాముడు తెలిపారు. స్థానిక సాయిబాబానగర్ కుబ్రా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులతోనే సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సంఘీయులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రూప్–1, 2 ఉద్యోగాలకు ప్రయత్నాలు చేసే నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పారు. సంఘీయులు ఏకతాటిపై నిలిచి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను సంఘీయులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కులపెద్దలు పుల్లయ్య, అనంత రమణ, సంఘం గౌరవాధ్యక్షుడు పట్నం రాముడు, జిల్లా అధ్యక్షులు మద్దయ్య, దస్తగిరి, సురేష్, గురున్నాథ్, సుధాకర్, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలు



యర్రగుంట్లలో వేసిన రోడ్డు

శిరివెళ్ల: మండలంలో టీడీపీ పాలనలో సాధ్యం కాని సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో చకచకా ముందుకు సాగుతున్నాయి. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో దాదాపు 32 ఏళ్లలో వేయని సిమెంట్ రోడ్డు ప్రస్తుతం వేస్తున్నారు. టీడీపీ పాలనలో చివర ఏడాదిలో మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చాలని కంకర తోలి వదిలేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద సమస్యను స్థానికులు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సిమెంట్ రోడ్డు వేశారు. అలాగే బోయలకుంట్లలో కూడ సిమెంట్ రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో గోవిందిపల్లె, కామినేనిపల్లె, శిరివెళ్ల, కోటపాడు, గుంప్రమాన్‌దిన్నె, వనికినిదిన్నెలలో రూ. 1.50 కోట్లతో సిమెంట్ల రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.



బోయలకుంట్లలో వేస్తున్న రోడ్డు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించి అప్రమత్తంగా ఉండేలా చూడాలని చెప్పారు.

చంద్రబాబు మాయమాటలకు అమాయకులు బలి



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్ పాలన
- అట్టహాసంగా పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాయమాటలకు అమాయకులు బలి అవుతున్నారని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు 2014లో అధికారంలోకి రావడానికి ముందు మహిళలకు, వృద్ధులకు, రైతులకు, యువకులకు, అన్ని వర్గాల ప్రజలకు 600కు పైగా హామీలతో మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే నినాదంతో మోసం చేసేందుకు మీ ముందుకు వస్తున్నారని ఆయన మాటలు నమ్మితే మళ్లీ మోసపోవడం గ్యారెంటీ అని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ల కోసం అవ్వ, తాతలు, అక్క చెల్లెమ్మలు పడిగాపులు కాసేవారని గుర్తు చేశారు. రూ.3 వేలకు పింఛన్ పెంపు ఆదర్శమన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు మేకల ఓబులేస్, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సత్తిగారి బాలిరెడ్డి, గగ్గెర వెంకటేశ్వర్లు, జేసిఎస్ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య(బుజ్జి), మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

చాగలమర్రి: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని రూ.3వేలకు పెంచారు. పెంచిన పింఛన్లు, కొత్తగా మంజూరైన వాటిని సోమవారం స్థానిక ఎస్సార్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే గంగల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబులాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 6,456 పింఛన్లు ఉన్నాయని, కొత్తగా 110 మందికి మంజూరయ్యాయని చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల, అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శంకర్ కోరారు. సామరస్యంగా అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశా. సామేలు, మౌలీసా పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం దీక్షలు కొనసాగాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరాహార దీక్షలు చేపట్టారు. లక్ష్మణ్, గౌస్, భాస్కరాచారిలతో పాటు ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



గుంతలమయమైన చాకరాజువేముల-డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు

తీరనున్న రోడ్డు కష్టాలు

దొర్నిపాడు: చాకరాజువేముల–డబ్ల్యూ గోవిందిన్నె రోడ్డు సమస్య తీరనుంది. నూతన రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల పొలాలు ఈ దారిలోనే ఉండటంతో రైతులు అధికంగా రాకపోకలు సాగించేవారు. రోడ్డు ధ్వంసమవడంతో పొలాలకు వెళ్లేందుకు, దిగుబడలను ఇళ్లకు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడేవారు. గతంలో రోడ్డు వేయాలని కోరినా పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోని నిధులు మంజూరు చేయించారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రాజకీయాలతో ముడి పెట్టొద్దు

- మహానంది ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి

మహానంది: మహానంది ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగానే సుబ్బరాయుడు సెలూన్ దుకాణం తొలగించాల్సి వచ్చిందని, ఇందులో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపులు లేవని మహానంది ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శనివారం మహానంది వచ్చిసి చేసిన రాజకీయ వ్యాఖ్యలను ఖండించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ట్రస్టీ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ.. మహానంది అభివృద్ధే లక్ష్యంగా ఒక్క రూపాయి ఆశించకుండా పని చేస్తున్నామన్నారు. క్షేత్రాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే మోడల్ టెంపుల్‌గా తయారు చేసేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఎంతో కష్టపడుతున్నారన్నారు. తన సొంత డబ్బులు రూ. 2 కోట్లు వెచ్చించి ఆలయ ప్రాంగణంలో సుందరీకరణ పనులు చేపడుతున్న విషయం కనిపించలేదా అంటూ ప్రశ్నించారు. దేవస్థానం ప్రాంగణంలో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు అనుమతులు వచ్చాయని, వర్క్ ఆర్డర్లు కూడా పూర్తయ్యాయని అందులో భాగంగానే సుబ్బరాయుడు దుకాణం తొలగించాల్సి వచ్చింది తెలిపారు. తొలగించిన సుబ్బరాయుడుకు సమీపంలో షాపు కేటాయించడం మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. ఆలయ ప్రాంగణంలో పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అసభ్యపదజాలంతో మాట్లాడడం సబబుగా లేదని, మీలాంటి వారు ఆదర్శంగా ఉండేలా మాట్లాడాలి అని హితవు పలికారు. బకాయిల విషయానికొస్తే మీ వెంట తిరిగేవారు సైతం బకాయిలు ఉన్నారని అన్నారు.

శిల్పా పేదల కడుపుకొట్టేవాడుకాదు..

దేవస్థానం అకౌంట్లో రూ.లక్షలు లేని రోజుల నుంచి నేడు రూ. 10.50 కోట్లు డిపాజిట్లు ఉండడం అభివృద్ధికి నిదర్శనం కాదా అని చైర్మన్ ప్రశ్నించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేదల కడుపు కొట్టేవాడు కాదని, కేవలం పెట్టేవాడని గుర్తు చేశారు. ఆలయ ప్రాంగణంలో వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులు కార్తీక మాసం వరకు అనుమతి అడిగారని, అందుకే అభివృద్ధి పనులను ఆపాల్సి వచ్చిందని తెలిపారు. ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున నిర్వహిస్తున్న అన్నపూర్ణ హోటల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ మండిపడడంపై.. స్పందిస్తూ గతంలో మీ ప్రభుత్వం లోనే షాపుకు అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. ఏజేన్సీ ఉద్యోగులకు వేతనాలు పెరిగాయని, వారిలో మీ పార్టీ వారు ఉన్నారని, కానీ ఎవరినీ తొలగించలేదని తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యులు దాతల సహకారంతో అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి రాజకీయం పేరుతో అనాలోచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మహానంది మండల వైఎస్సార్‌సీపీ యువనేత ఒంటెద్దు వీరారెడ్డి, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, నాయకులు మహానంది సాంబిరెడ్డి, భూమా సుబ్బరామయ్య, మనోహర్ రెడ్డి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.